
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 22 ఆగస్టు 2025





వర్షాలతో దెబ్బతిన్న మహేశ్వరం-తుమ్ములూరు ప్రధాన రోడ్డు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ధాన్యం సేకరణకు చర్యలు

» అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో ధాన్యం సేకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో 33 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ అంచనా వేసినందున ఎక్కడా సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరును పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారి వనజాత, జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, డీఆర్‌డీవో పీడీ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి ఉష, జిల్లా కోఆపరేటివ్ అధికారి సుధాకర్, మార్కెటింగ్ శాఖ అధికారి రియాజుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో స్వీకరించిన భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆదేశించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదాముల్లో నిల్వఉన్న బియ్యం పక్కదారి పట్టకుండా నేరుగా మిల్లులకు తరలించాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలన్నారు. డీఆర్‌ఓ సంగీత, ఆర్డీవోలు, తహసీల్దార్లు పౌరసరఫరాల శాఖ అధికారులున్నారు.

భయంభయంగా తరగతి గదిలో..

» శిథిలావస్థకు ఆగిర్యాల ప్రాథమిక పాఠశాల



పెచ్చులు ఊడి పడుతున్న పాఠశాల భవన పైకప్పు

కొందుర్గు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్త ఆగిర్యాల ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు తరగతి గదుల్లో పెచ్చులూడి పడుతున్నాయి. శిథిలాలు ఎప్పుడు ఎవరి మీద పడుతాయోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా శిథిల భవనాన్ని కూల్చివేసి నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు ఛిద్రం

భారీ వర్షాలకు ఆగమాగం

ఉమ్మడి జిల్లాలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అడుగుకో గుంత.. గజానికో గొయ్యి ఏర్పడి వాహనదారులు నరకం చూస్తున్నారు. గ్రామీణ, మున్సిపాలిటీ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎక్కడ చూసినా కంకర తేలి, గుంతలు పడి, వర్షం నీరు నిలిచి బురదమయంగా మారాయి. వాహన దారులను అప్రమత్తం చేసేందుకు భారీ గోతులు ఉన్న చోట స్థానికులు రాళ్లు, చెట్ల కొమ్మలను అడ్డుగా ఉంచుతున్నారు. ఛిద్రమైన రోడ్ల మరమ్మతులకు నోచుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.



వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఏక్మామిడి రోడ్డు దుస్థితి



ఫత్తేపురం విజయ ఆసుపత్రి వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



చేవెళ్ల మండల కేంద్రంలో..

ఉమ్మడి జిల్లాలో రోడ్లు గుంతలమయం

బురదతో ముందుకు సాగని ప్రయాణం

ఇబ్బందుల్లో వాహనదారులు

జాతీయ రహదారిపై పరిస్థితి మరింత దారుణం

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం ప్రభావంతో గత 15 రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వానలు దంచికొడుతుండటంతో రోడ్లన్నీ ధ్వంసమై చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. బురద నీటిలో రాకపోకలు సాగిస్తూ వాహనదారులు నరకం చూస్తున్నారు. తారు, కంకర లేచి భారీ గోతులు ఏర్పడ్డాయి. భారీ వాహనాల తాకిడికి కొన్నిచోట్ల గోతులు పెద్దవిగా మారాయి.

గుంతలను తప్పించే యత్నంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరికొందరు గోతులను గమనించక అదుపుతప్పి కిందపడిపోతున్నారు. రంగారెడ్డి జిల్లా- వికారాబాద్ జిల్లాలకు అనుసంధానంగా ఉన్న శంకర్‌పల్లి వయా మోమిన్‌పేట్ రోడ్డు దారుణంగా తయారైంది. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డును చేవెళ్ల, వికారాబాద్ ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేవెళ్ల మండల కేంద్రంలో

మిగతా 7వ పేజీలో...

వికారాబాద్ జిల్లాలో

వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం, మోత్కుపల్లి గ్రామం నుంచి వికారాబాద్ వెళ్లే రోడ్డు బురదయంగా మారింది. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఏక్మామిడి రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అడుగుకో గుంత వాహనదారుల చింతగా మారింది. దోమ మండలం పాలేపల్లి-అయినాపూర్ వెళ్లే బీటీ రోడ్డు గుంతలు ఏర్పడటంతో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడికి ప్రయాణించాలన్నా.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, రీబీటీకి నిధులు మంజూరు చేసి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

రీబీటీకి నిధులు మంజూరు చేయాలి



మా గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ హయంలో వేసిన బీటీ రోడ్డు పూర్తిగా పాడైంది. కొత్త రోడ్డుకు నోచుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులకు ఎన్నో వినతులు చేశాం. తర్వరగా బీటీ రోడ్డు వేయాలి.

గీతేశ్వరి, కొలన్‌గూడ మాజీ సర్పంచ్, కందుకూరు మండలం



పూజలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

భారీ వర్షాలతో చెరువులకు జలకళ

జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు నిండి జలకళను సంతరించుకున్నాయని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం షాబాద్‌లో పహిల్వాన్ చెరువు వద్ద హనుమాన్ విగ్రహానికి మత్స్యకారులు, రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, లింగం, నాయకులు రాహుల్‌గుప్తా, సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, సంజీవరెడ్డి, గౌరీశ్వర్, గౌతం, కిషోర్, శేఖర్, రమేష్, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ధీమా ఏదీ?

కార్మికులకు వైద్యం.. దైన్యం



షాద్‌నగర్ ముఖ్య కూడలి

షాద్‌నగర్‌లో ఆసుపత్రి ఏర్పాటుకు డిమాండ్

కొత్తూరులో డిస్పెన్సరీ..

అత్యవసరమైతే సనత్‌నగర్‌కు..

ఇబ్బందుల్లో కార్మికులు, వారి కుటుంబాలు

నియోజకవర్గంలో 35 వేల మంది కార్మికులు

షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానికి చేరువలో ఉండి అతి పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా పేరుగాంచిన షాద్‌నగర్‌లో ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు. నియోజకవర్గంలోని కొత్తూరు, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, కేశంపేట మండలాల్లో సుమారు 300కు పైగా పరిశ్రమలున్నాయి. వాటిల్లో సుమారు 35 వేల మంది కార్మికులు పని చేస్తుండగా, వారిపై వాళ్ల కుటుంబాలు ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయి. స్థానికులతోపాటు ఎక్కువ శాతం బీహార్, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఎక్కువగా ఉన్నారు. వేల కిలోమీటర్ల దూరం నుంచి పొట్టచేత పట్టుకొని వలస వచ్చిన కార్మికులకు సకాలంలో సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అత్యవసరమైతే దూర ప్రాంతాలకు పరుగులు

షాద్‌నగర్ నియోజకవర్గంలో పరిశ్రమలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. ఫుడ్, ఫార్మా, ఐరన్, స్టీల్, పైపులు, గ్లాస్ తోపాటు ఇతర పరిశ్రమలున్నాయి. వాటికి తోడు ఫరూఖ్‌నగర్, కొందుర్గు మండలాల్లో

మిగతా 8వ పేజీలో...

ప్రతి ఒక్కరికి ఈఎస్ఐ కార్డులివ్వాలి...

పరిశ్రమలో పనిచేసే ప్రతి కార్మికుడికి నిబంధనల మేరకు ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలి. కానీ చాలా పరిశ్రమల్లో ఇవ్వడం లేదు. దీంతో వైద్య ఖర్చులు ఎక్కువై ఆర్థికంగా భారమవుతుందని కార్మికులు అంటున్నారు.

ఆసుపత్రి ఏర్పాటు చేయాలి



షాద్‌నగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చాలా అవసరం. ఈ విషయంపై సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇచ్చాం. ఈఎస్ఐ కార్డులు ఆసుపత్రి ఏర్పాటుకు అనుగుణంగా లేవని అంటున్నారు. యాజమాన్యాలు కార్మికులకు అందరికీ కార్డులు ఇవ్వడం లేదు. కొత్తూరులో 20 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి.

\- రాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

నేటి నుంచి పనుల జాతర!

జిల్లాలో 1,212 పనులు..రూ.15.30 కోట్ల నిధులు

ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం.. ప్రారంభించనున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎల్కగూడ పంచాయతీ భవనం

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల ద్వారా చేపట్టబోయే కొత్త పనులను ఏకకాలంలో ప్రారంభించేందుకు 'పనుల జాతర 2025' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం నేడు శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా గతంలో పూర్తయిన పనులను ప్రారంభిస్తూ, కొత్త పనులకు భూమిపూజ చేయనున్నారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 256 గ్రామాల్లో నేడు ఒకేరోజు పనుల జాతర నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 1,212 పనులకు సుమారు రూ.15.30 కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, భూమి పూజలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో పాల్గొననున్నారు. ఉపాధిహామీ పథకం అమలులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద కూలీ కుటుంబాల జీవనోపాధులను మెరుగుపర్చేందుకు ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు కూలీ పని కల్పించడానికి పెద్ద ఎత్తున వ్యక్తిగత, సామూహిక ఆస్తుల కల్పనలో భాగంగా వివిధ రకాల పనులను చేపట్టారు. ఇందులో భాగంగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ, ఆధ్వర్యంలో పూర్తయిన పనులు, కొత్త పనులకు భూమి పూజ కార్యక్రమాలను చేపట్టేందుకు పనుల జాతర 2025ను నిర్వహిస్తున్నారు. నూతన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా కింద వ్యక్తిగత ఆస్తుల కల్పన పనులైన పశువుల కొట్టం, కోళ్ల షెడ్, గొర్రెల షెడ్, పండ్ల తోటలు, వానపాములతో ఎరువుల తయారీ, అజోలాపిట్ నిర్మాణం, జలనిధి కింద వాననీటి సంరక్షణ-భూగర్భజలాలు పెంచే ఫారమ్ పాండ్స్, ఊట కుంటలు వంటి పనులను ప్రారంభించనున్నారు. భూమి పూజలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు, లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను గ్రామ సభల్లో అందజేయనున్నారు. ఉపాధి హామీ పథకంలో ఎక్కువ రోజులు పనిచేసిన కూలీలను, దివ్యాంగులను, పారిశుధ్య కార్మికులను, సంరక్షకులను సన్మానించనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాల అధికారులైన ఉపాధిహామీ, స్వచ్ఛభారత్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్-ఇంజనీరింగ్, వాటర్‌షెడ్ వంటి అన్ని విభాగా అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు.

ఆమనగల్లు తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

» కలెక్టర్ ఉత్తర్వులు జారీ



తహసీల్దార్ లలిత

ఆమనగల్లు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో పట్టుబడిన ఆమనగల్లు మండల తహసీల్దార్ చింతకింది లలితను సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయానికి గురువారం సాయంత్రం ఉత్తర్వులు అందాయి. ఆమనగల్లు మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతుకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకంలో జెండర్ సవరణ కోసం తహసీల్దార్ లలిత రూ.లక్ష డిమాండ్ చేసి రూ.50వేలు తీసుకున్నట్లు బాధిత రైతు ఫిర్యాదు మేరకు.. ఏసీబీ సిటీ రేంజ్ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారుల బృందం మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఆధారాలు సేకరించి లలిత, రవిలపై కేసు నమోదు చేశారు. జెండర్ సవరణ కోసం లంచం డిమాండ్ చేసిన తహసీల్దార్ లలిత, సర్వేయర్ కోట్ల రవిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, ఏసీబీకి పట్టుబడి కేసు నమోదైన తహసీల్దార్ లలితను బుధవారం సస్పెండ్ చేశారు. ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయిన తహసీల్దార్ లలిత గురువారం విధులకు హాజరై పలువురికి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు జారీతో పాటు పలు దస్త్రాలపై సంతకాలు చేసిన విషయమై ఉన్నతాధికారుల ఆదేశానుసారం డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ గురువారం రాత్రి ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి

గొప్ప మార్పు చూపిస్తాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

చేవెళ్లలో పల్లెపల్లెకూ బీజేపీ కార్యక్రమం



రాంచందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి.. కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చినా ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని, నిజమైన అభివృద్ధి, మార్పు కోసం బీజేపీకి ఒక్క చాన్స్ ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కోరారు. 'పల్లెపల్లెకూ బీజేపీ' కార్యక్రమాన్ని ఆయన చేవెళ్ల మండలంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి చన్వెల్లి గ్రామానికి చేరుకున్నారు. అంతకుముందు మల్కాపూర్, పామెన, బస్తేపూర్, ఖానాపూర్ తదితర గ్రామాల్లో బీజేపీ జెండాను

మిగతా 8వ పేజీలో...

ఖానాపూర్‌లో రాత్రిబస..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన దళిత రైతు సత్తయ్య ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి భోజనం చేశారు. అనంతరం రాత్రి ఆ ఇంట్లోనే అధ్యక్షుడు నిద్రించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మాత్రం ఖానాపూర్ గేట్ వద్ద ఉన్న శ్రీనివాస కల్యాణ మండపంలో నిద్రపోయారు.

పోచారం మున్సిపల్ కమిషనర్‌గా నిత్యానంద్

ఘట్‌కేసర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ కమిషనర్‌గా ఎస్.నిత్యానంద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎల్లంపేట్ నుంచి పోచారానికి బదిలీపై వచ్చాడు. ఇప్పటి వరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన వీరారెడ్డి సచివాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిషర్‌కు స్వాగతం, బదిలీపై వెళ్లిన కమిషనర్‌కు మున్సిపల్ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డీఈ మహిపాల్, మేనేజర్ అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.


కమిషనర్ నిత్యానంద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న మేనేజర్

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి


కందుకూరులో పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ జానకీరెడ్డి

కందుకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని మహేశ్వరం ఏసీపీ కె.జానకీరెడ్డి అన్నారు. గురువారం కొత్తగూడలోని ఎంఎంఆర్ బాంక్వెట్ హాల్‌లో పీస్ కమిటీ సమావేశంలో తహసీల్దార్ కె.గోపాల్, సీఐ సీతారాం, ఎంపీడీవో సరితలతో కలిసి మాట్లాడారు. 27న జరుపుకునే వినాయక చవితి నుంచి నవరాత్రులకు మండలంలో ఏర్పాటు చేయనున్న మండపాలకు అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద రాత్రి 10గంటలకల్లా సాంస్కృతిక కార్యక్రమాలను నిలిపివేయాలన్నారు. అన్న ప్రసాదాలు, పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. డీజేలు పెట్టొద్దన్నారు. నిమజ్జనాల్లో అల్లర్లు జరుగకుండా మండపాల కమిటీలు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవి, ఎస్సైలు పరమేశ్, వెంకటేశ్, ఏఎస్‌ఐ బలరామరాజు, సాధ మల్లారెడ్డి, ఎ.కుమార్, సులేమాన్, అఫ్జల్‌బేగ్, జగదీశ్, బి.బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలి

కీసర రూరల్: గణపతి ఉత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నాగారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చవితి ఉత్సవాలపై నాగారం, దమ్మాయిగూడ పరిధి మండప నిర్వాహకులు, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. తక్కువ ఎత్తున్న విగ్రహాలను ప్రతిష్ఠించుకుంటే అధిక శాతం ప్రమాదాలను నివారించుకోవచ్చన్నారు. కాలనీల్లో రోడ్లు బ్లాక్ చేయకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుషాయిగూడ ఏసీపీ వెంకటరెడ్డి, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, కీసర సీఐ ఆంజనేయులు, జవహర్‌నగర్ సీఐ సైదులు, దమ్మాయిగూడ, నాగారం మున్సిపల్ కమిషనర్లు వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈలు, ఇరిగేషన్, హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు, కాలనీ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.


కీసర రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా


బీఆర్ఎస్ నాయకుడు నర్సింలును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

కేశంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తాను బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ప్రమాదంలో గాయపడిన కార్యకర్తలను పరామర్శించి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. తొమ్మిదిరేకుల బీఆర్ఎస్ అధ్యక్షుడు గోస్కె నర్సింలు, నాగిళ్ల బాలరాజు, లేమామిడి మాజీ ఉప సర్పంచ్ మన్మథరెడ్డి, బషీద్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వారిళ్లకు వెళ్లి పరామర్శించారు. కొండారెడ్డిపల్లికి చెందిన బుడుగు బాలయ్య, లేమామిడికి చెందిన వెంకటలక్ష్మమ్మలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇచ్చారు. కార్యక్రమాల్లో మాజీ వైస్ఎంపీపీ సురేందర్, కేశంపేట మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, రాంరెడ్డి, శ్రీశైలంగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రామచందర్, భూపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, నాగరాజు, వెంకటేష్, రామస్వామి, తిరుపతిరెడ్డి, జగన్‌రెడ్డి, ఆంజనేయులు, యాదయ్య, మల్లేశ్, అమరేందర్, తలసాని ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు కల్పిస్తా..

నిర్దవెల్లి జెడ్పీ పాఠశాలలో వసతులు కల్పిస్తానని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాఠశాలను సందర్శించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు, ఉపాధ్యాయినులు తెలపగా తన సొంత డబ్బుతో వసతులు కల్పిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను సన్మానించారు.

'డబుల్' ఇళ్లలో సమస్యలను వెంటనే పరిష్కరించాలి

శామీర్‌పేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకిచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సమస్యల వెంటనే పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని పార్టీ జిల్లా కార్యదర్శి సత్యం అన్నారు. గురువారం సత్యం, నాయకులతో కలసి తూంకుంటలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సందర్శించి అక్కడ నివాసముంటున్న వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఇళ్లలో నెలకొన్న సమస్యలపై పట్ల తూంకుంట మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్నా పరిష్కరించడం లేదని లబ్ధిదారులు వాపోయారు. సత్యం మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు బస్సు సౌకర్యం లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, చెరువు కట్టకు మరమతులు చేయక చెరువు నుంచి కట్ట కింద నీరు లీకై డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి వస్తోందని సత్యం అన్నారు. ఇక్కడ ఒక అంగన్‌వాడీ సెంటర్‌ను, ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను, రేషన్ షాపును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళల భద్రత దృష్ట్యా పెట్టుకొని పోలీసు పెట్రోలింగ్ చేసి రక్షణ కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 25న మేడ్చల్ కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్న చేపడుతామని పార్టీ జిల్లా సెక్రెటరీ సత్యం హెచ్చరించారు.


లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం నాయకుడు సత్యం

మహేశ్వరంలో ఘనంగా పోచమ్మ బోనాలు

మహేశ్వరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):మహేశ్వరంలో పోచమ్మ బోనాలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తులు అమ్మవారికి అభిషేకాలు చేసి నైవేద్యం సమర్పించారు. వేలాదిగా అమ్మవారికి పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. వివిధ పార్టీల నాయకులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. బోనాల ఊరేగింపులో గంగపుత్రుల జాల పందిరి, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువతీ యువకుల కేరింతలు, వీఐపీల సందడితో ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డిలు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రజలు శాంతి యుతంగా ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. అలాగే వినాయక పండగను కూడా ప్రశాంతంగా జరుపుకోవాలని, నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఉత్సవాలను పర్యవేక్షిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, డీసీపీ సునీతారెడ్డి

విత్తన గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

తాండూరు,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విత్తన గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. గురువారం తాండూరు పట్టణం ఎన్ఎస్పీ ట్రస్ట్ కార్యాలయంలో విత్తన గణపతి విగ్రహాలను పంపిణీ చేసి మాట్లాడారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ హరిత సేన వ్యవస్థాపకులు జోగినిపల్లి సంతోష్ చేపట్టిన పర్యావరణ పరిరక్షణ కోసం విత్తన గణపతిని పంపిణీ చేశామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి గణపతులను పూజించాలని కోరారు. నీటి కాలుష్యం కలుగకుండా విత్తన గణపతిని ప్రతిష్ఠించి నిమజ్జనం రోజు వినాయకుడిని ఇంటి వద్దే నిమజ్జనం చేయొచ్చని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్‌లు కొట్రిక విజయలక్ష్మి, తాటికొండ స్వప్న, ఎన్ఎస్పీ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శివాణి, లెక్చరర్లు బసంత్, సోమనాథ్, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌గౌడ్, రాష్ట్రపతి అవార్డీ గోవింద్‌రావు, ఎన్ఎస్పీ ట్రస్ట్ సభ్యులు భాను, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.


విత్తన గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న శుభప్రద్‌పటేల్

మూసీలో నీటి నిల్వపై ఏకీకృత ప్రణాళిక


మూసీనదిని పరిశీలిస్తున్న ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నర్సింహారెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మూసీనదిలో వరదను నియంత్రిస్తూ నీటి నిల్వకు ఆధునిక పద్ధతులు, పర్యావరణ పునరుద్ధరణ, భద్రతా చర్యలపై ఏకీకృత ప్రణాళికపై ఎంఆర్‌డీసీఎల్ అధికారులు అధ్యయనం చేశారు. ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నర్సింహారెడ్డి, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు, కన్సల్టెన్సీ సంస్థల ప్రతినిధులు గురువారం మూసీ పరివాహక ప్రాంతాలను, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను సందర్శించారు. మూసీనదిలో నీటి ప్రవాహం, జలాశయాల నుంచి వరద పరిస్థితిపై అంచనా వేశారు. మూసీలో వరద నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ... మూసీనది అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గేట్ వే ఆఫ్ హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ గాంధీ సరోవర్ వరకు వివిధ ప్రాంతాల్లో ఐకానిక్ టవర్, ఎకో టూరిజం పనులతో సుందరీకరణ పనులకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



బాధితులతో మాట్లాడుతున్న అనసూయ

నిందితులను జైలుకు పంపాలి

ధారూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకులపై దాడి చేసిన నిందితులపై హత్యాయత్నం కేసులుపెట్టి జైలుకు పంపాలని, లేకుంటే ఎస్పీ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేపడుతామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనసూయ అన్నారు. నాగారంలో దాడికి గురైన భారతమ్మ-అంజి దంపతులు గురువారం ఆమె పరామర్శించి సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. దంపతులపై దాడి చేసి 9 రోజులవుతున్నా నిందితులను పోలీసులు అరెస్టు చేయడం లేదని, నామమాత్ర కేసులు పెట్టి వదిలేయడం అన్యాయం అన్నారు. దాడిచేసిన గంజాయి బ్యాచ్‌తో పోలీసులు కుమ్మక్కయి బాధితులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నిందితులను జైలుకు పంపకుంటే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు.



బుగ్గ ఆలయంలో పూజలు చేసిన అక్కమహాదేవి సంఘం మహిళలు

బుగ్గ ఆలయంలో మహిళల పూజలు

వికారాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రావణాన్ని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణ పరిధి బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం వికారాబాద్‌కు చెందిన అక్క మహాదేవి మహిళా సంఘం సభ్యులు ఆలయంలో అభిషేకం, అనంతరం భజన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో చంద్రకళ, విజయలక్ష్మి, గిరిజమ్మ, శోభ, జయమ్మ, నరసమ్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీ శిశుమందిరంలో అవధానం చేస్తున్న అనంతప్ప

కళ్లకు గంతలతో అవధానం

తాండూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తాండూరులోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గణిత అవధాని రాష్ట్రపతి అవార్డీ కోకట్ అనంతప్ప గురువారం అవధానం నిర్వహించారు. మొదటి అంశంగా మాయ కూడిక, చదవడం విద్యార్థులకు చూపించారు. మెమొరీ శతావధానంలో భాగంగా వంద వివిధ వస్తువులు, జంతువుల పేర్లను బోర్డుపై రాసి విద్యార్థుల కళ్లకు గంతలుకట్టి బోర్డుపై ఉన్న పేర్లను సీరియల్‌గా చెప్పించారు. అనంతప్ప మాట్లాడుతూ.. విద్యార్థులు మేధావులుగా రూపుదిద్దుకోవాలని సూచించారు. హెచ్ఎం విజయలక్ష్మి, కార్యదర్శి అనంత్‌రెడ్డి, కోశాధికారి రాంరెడ్డి పాల్గొన్నారు.

ఉరుస్తున్న ఎస్‌బీఐ భవనం

» బషీరాబాద్ బ్రాంచ్‌లో సేవల నిలిపివేత



శిథిలావస్థలో బ్యాంకు లావాదేవీల గది

బషీరాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో మూడు రోజులుగా ఖాతాదారులకు సేవలందడంలేదు. భారీ వర్షాలకు బ్యాంకు పురాతన భవనం ఉరిసి కంప్యూటర్లు, రికార్డులు, సామగ్రి తడిసిపోయాయి. కంప్యూటర్లు పనిచేయడం లేదు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సిబ్బంది జంకుతున్నారు. మూడు రోజులుగా బ్యాంకు సేవలను నిలిపేశారు. భవన లీకేజీలపై బ్రాంచ్ మేనేజర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తాండూరు ఎస్‌బీఐ(వ్యవసాయ శాఖ) బ్రాంచ్‌లో అత్యవసర ఆర్థిక సేవలందిస్తున్నట్లు బ్యాంకు ఉద్యోగి చెప్పారు. ఈ విషయం తెలియక ఖాతాదారులు బ్యాంకుకొచ్చి ఉస్సూరుమంటూ తిరిగి వెళ్లిపోతున్నారు. సోమవారం వరకు ఈ బ్రాంచ్‌లో సేవలందించే పరిస్థితి లేదని బ్యాంక్ సిబ్బంది చెబుతున్నారు.



లారీ నుంచి యూరియా తీసుకుంటున్న రైతులు

యూరియా కోసం రైతుల పాట్లు

యాచారం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కొరత నేపథ్యంలో యూరియా కోసం రైతులు ఎగబడుతున్నారు. రెండు రోజులుగా వర్షాలు విరామమివ్వడంతో గురువారం యాచారం సొసైటీకొచ్చిన 550 బస్తాల యూరియాను లారీ నుంచి నేరుగా రైతులు పొలాలకు తీసుకెళ్లారు. పట్టా పాస్‌బుక్‌లు తెచ్చి వేలిముద్రలను వేసిన తరువాతే యూరియా ఇస్తున్నారు. మండలంలో పత్తి, మొక్కజొన్న ఇతర పంటలకు వంద టన్నుల యూరియా అవసరమని హాకాకు ఇండెంట్ పెట్టామని సొసైటీ సీఈవో నాగరాజు తెలిపారు. శనివారం మధ్యాహ్నానికల్లా వంద టన్నుల యూరియా వస్తుందని ఆయన చెప్పారు.

మార్కులే కాదు..

పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి

ఇంటర్మీడియట్ విద్యాశాఖ నోడల్ అధికారి శంకర్‌నాయక్

బొంరాస్‌పేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మార్కులే కాదు.. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ నోడల్ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. గురువారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాల నిర్వాహణపై ప్రిన్సిపాల్ రోజారాణితో చర్చించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ చొరవతో కళాశాలకు బెంచీలు, బీరువాలు, కుర్చీలు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరుకు అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేశారన్నారు. విద్యార్థులు రోజూ కళాశాలకు హాజరై క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల ఖర్చులపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.



రోడ్డుపై నిలిచిన నీటిలో వరినాట్లు వేస్తున్న మహిళలు

రోడ్డు గుంతల్లో నాటేసి నిరసన

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్యజ్యోతి): మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధి అజీజ్‌నగర్‌లో భారీ వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసమైనా పట్టించుకొనే వారు కరువయ్యారని నాయకులు కొత్త మానిక్‌రెడ్డి. బండ్లగూడ శ్రీధర్ అన్నారు. శ్రీనిధి పాఠశాల నుంచి ఎస్సీ కాలనీ వరకు ఉన్న రోడ్డుపై మోకాళ్లలోతు గుంతలేర్పడ్డాయి. గురువారం ఆ గుంతల్లో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. వెంటనే రోడ్డును బాగుచేయాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా రోడ్లకు మరమ్మతులు చేయడం లేదన్నారు. నిరసనలో విజేందర్, అశోక్, మాణిక్యం, గోపాల్, మహిళలు పాల్గొన్నారు.

సామాజిక సంఘ సంస్కర్త జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

» రైతు కుటుంబం నుంచి అత్యున్నత స్థాయికి....

» ఉప రాష్ట్రపతి అభ్యర్థి కావడం సంతోషకరం

» కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్



ఆకులమైలారంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కేఎల్లార్

కందుకూరు,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి):ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన సామాజిక సంఘ సంస్కర్త బి.సుదర్శన్‌రెడ్డి జిల్లావాసి కావడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఆకులమైలారం(మాలగూడ) గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ గ్రామానికి చెందిన వ్యక్తి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేయడానికి నామినేషన్ వేయడం ఆనందంగా ఉందన్నారు. రైతు కుటుంబానికి చెందిన ఆయన సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పనిచేసి నేడు సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేయడం హర్షణీయమన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎంపీలు సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి అభ్యర్థిగా చూడకుండా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తిగా చేసిన సేవలను గుర్తించి విజయం కోసం కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఏఎంసీ డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ.సురేందర్, మాజీ ఉప సర్పంచ్ జి.రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



కోట్‌పల్లి: ధ్వంసమైన మొత్కుపల్లి-వికారాబాద్ రోడ్డు



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం తల్లారానికి వెళ్లే రోడ్డు

రోడ్లు ఛిద్రం

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారి గుంతలమయంగా మారింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా ఇదే దారిలో ఉంది. రెండేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఓ యువకుడు తన సొంత డబ్బులతో గుంతలు పూడిపించినా పక్కనే గుంతలు ఏర్పడ్డాయి. తల్లారం, దుద్దాగు, రామన్నగూడ, న్యాలట, కుమ్మెర, పామెన, చెనువల్లి, బస్తేపూర్, కౌకుంట్ల, హస్తేపూర్, ఆలూరు నుంచి తంగడపల్లి రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. కందుకూరు మండలంలోని కొలన్‌గూడ నుంచి ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు వరకు నాలుగు కిలోమీటర్ల దూరం వరకు గత 20ఏళ్ల క్రితం బీటీ రోడ్డు వేశారు. ప్రస్తుతం వర్షాలు బీటీ లేచిపోయి ఇబ్బందిగా మారింది. జబ్బార్‌గూడ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. హిమాయత్‌నగర్-తంగడపల్లి రోడ్డు గుంతలు పడింది. రెడ్డిపల్లి కల్వర్టుపై రోడ్డు పాడైంది. ఆమనగల్లు మండలం జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండల చంద్రాయన్‌పల్లికి వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. దీంతో ఈ గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు నకరయాతన పడుతున్నారు. భారీ వర్షాలకు మహేశ్వం-తుమ్మలూరు ప్రధాన రహదారి అడుగుకో గుంత ఏర్పడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

శంకర్‌పల్లిలో...

శంకర్‌పల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు శంకర్‌పల్లి పట్టణంలో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఇంద్రారెడ్డి చౌరస్తా నుంచి ఫత్తేపురం ఫ్లైఓవర్ వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి నోచక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచింది. అలాగే శంకర్‌పల్లి చౌరస్తా నుంచి ఫత్తేపురం వరకు కి.మీ పరిధి గల రోడ్డంతా గుంతలుగా మారడంతో నరకాన్ని తలపిస్తున్నది. ఈ రోడ్డుపై వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



ఫత్తేపురం రోడ్డు పూర్తిగా పాడవ్వడంతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడటంతో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. రోడ్డుపైన ఏర్పడిన గుంతలలో నీళ్లు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా రోడ్డు పనులు ప్రారంభించాలి. ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు

ప్రమాదకరంగా ఫత్తేపురం రోడ్డు



శంకర్‌పల్లి చౌరస్తా నుంచి ఫత్తేపురం వరకు నాలుగులేన్ల రోడ్డును వేసి మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేస్తామని అప్పట్లో అధికారులు చెప్పారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు నరకాన్ని తలపిస్తోంది. ఇప్పటికైనా త్వరితగతిన పనులు ప్రారంభించాలి.

బీర్ల సురేష్‌కుమార్, శంకర్‌పల్లి బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు



ఆమనగల్లు: బురదమయంగా జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి రోడ్డు

తాగి పాఠశాలకు..

» రోజూ మద్యం తాగొచ్చి విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ఉపాధ్యాయుడు

» హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో టీచర్ నిర్వాకం

» విధుల నుంచి తొలగించాలని తల్లిదండ్రులు, విద్యార్థుల డిమాండ్



మద్యం మత్తుతో ఆఫీసులో కూర్చున్న హిమన్షహ

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్యజ్యోతి): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు రోజూ తాగొచ్చి వృత్తికే కళంకం తెస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధి హిమాయత్ నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ హిమన్షహ పాఠాలు చెప్పడం మాని నిత్యం మద్యం తాగివస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాడని గ్రామస్తులు అంటున్నారు. గురువారం సదరు ఈచర్ విపరీతంగా మద్యంతాగి రావడంతో విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారొచ్చి చూడగా హిమన్షహ మద్యం మత్తులో మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. ఈ తాగుబోతు ఉపాధ్యాయుడిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల సమాచారంతో ఎంఈవో మల్లయ్య స్కూలుకొచ్చి తల్లిదండ్రులకు నచ్చజెప్పి పంపించారు. శుక్రవారం ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడుతానని చెప్పారు. ఈ విషయమై ఎంఈవో స్పందిస్తూ.. హిమన్షహ పాఠశాలకు తాగొస్తున్నాడని పలుమార్లు ఫిర్యాదులు రాగా అతడిని హెచ్చరించామని చెప్పారు. అయినా ప్రవర్తనలో మార్పు రావడం లేదన్నారు. అతడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంఈవో మల్లయ్య వివరించారు.

సమాజ సేవకు కృషి

» బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవికుమార్‌శర్మ

షాద్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం కార్యనిర్వాహక కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన పూజారి సంబరాజు రవికుమార్ శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని బ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనం బ్రాహ్మణ సేవా అనుబంధ సంఘాలను ప్రకటించారు. రవికుమార్ శర్మ షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతి దేవాలయంలో పూజారిగా, పురోహితుడిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాల్లో తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి అశోక్

ఘట్‌కేసర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి అశోక్ సూచించారు. ఘట్‌కేసర్ 108 వాహనాన్ని గురువారం తనిఖీ చేశారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో ఉన్న వాహనాన్ని పరిశీలించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అంబులెన్స్‌లో అత్యవసర పరికరాలు పనిచేస్తున్నాయా, ఆక్సిజన్‌తో పాటు వివిధ రకాలు పరికరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన అంబులెన్స్ పైలెట్ భద్రునాయక్, ఈఎంటీ రమేష్‌తో మాట్లాడారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సేవలందించాలని కోరారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

» ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కుర్మిద్దలో యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

యాచారం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం రేవంత్ నేతృత్వంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుర్మిద్దలో రూ.386లక్షలు, తాటిపర్తిలో రూ.641లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు యూరియా సరిపడా అందిస్తున్నట్లు వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో వేలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఫార్మాసిటీ విషయంలో రైతులు ఆందోళన చెందరాదని కోరారు.

ఆదుకోవాలని ఎమ్మెల్యేకు రైతుల వినతి

భూసేకరణ పరిహారం సరిగా అందలేదని మూడెకరాల సాగు భూమి ఉంటే కేవలం ఎకరంన్నరకు మాత్రమే ఇచ్చారని, ప్లాట్లు కూడా రాలేదని కుర్మిద్ద గ్రామ రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బి.రాజశేఖర్‌రెడ్డి, డి.రమేష్, ఎం.వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాధారాణి, డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ వంశీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్, మండల వ్యవసాయాధికారి రవినాథ్, ఎంపీవో శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఏడుగురి ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కేపీహెచ్‌బీ నుంచి ఏడుగురు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. 17న ఏఎస్‌రావునగర్‌లోని మారుతి బాల్‌బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో జరిగిన పోటీల్లో ఎంపిక చేశామని కేపీహెచ్‌బీ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మొర్ల రామకృష్ణ తెలిపారు. రమేష్, పెద్దిరెడ్డి, అశోక్‌గౌడ్, అనికేతన్‌కుమార్, దినేష్‌కుమార్, ప్రసన్నకుమార్, అనిల్ ఈ నెల 23, 24 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా గోలేటిలో అంతర్ జిల్లా సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. సెప్టెంబరు 24-28 రాష్ట్రం తరఫున చెన్నైలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ...

మోమిన్‌పేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ క్రీడా పోటీల ఎంపిక నిర్వహిస్తామని ఎంఈవో మల్లేశం గురువారం పేర్కొన్నారు. ఈ నెల 22న మోమిన్‌పేట్‌లోని మానవ వనరుల అభివృద్ధి కార్యాలయంలో అండర్-14, 17 విభాగంలో క్రీడా పోటీలకు ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. మోమిన్‌పేట్, మర్పల్లి, బంట్వారం మండలాల బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ నెల 25న టేకులపల్లి జెడ్పీ పాఠశాలలో కబడ్డీ, 26న పట్లూర్ జెడ్పీ పాఠశాలలో వాలీబాల్ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవోతో పీడీ వసంత్, పీఈటీలు, కంప్యూటర్ ఆపరేటర్ సుజాత, పద్మారావు, సీఆర్‌పీలు శ్రీనివాస్, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులు యోగాపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి టి.దేవేందర్‌గౌడ్

మహేశ్వరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, పెద్దలు ప్రతి ఒక్కరి దైనందిక జీవితంలో మార్పు తేవడం, అంతర్గత శక్తిని మేలుకొల్పేందుకు స్వాష దోహద పడుతుందని మాజీ మంత్రి టి.దేవేందర్‌గౌడ్ అన్నారు. గురువారం తుక్కుగూడలోని దేవేంద్ర విద్యాలయంలో స్వాష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మనస్సును సమతుల్యం చేయడానికి, శరీరాన్ని శక్తిమంతం చేయడానికి రూపొందించిందే స్వాష అన్నారు. ప్రతీ ఒక్కరు రోజూ గంట యోగాకు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా దేవేంద్ర స్కూల్‌లో విద్యార్థులు స్వాష, యోగ రోజూ అభ్యసించేలా కార్యక్రమాన్ని రూపొందించిన పాఠశాల బోర్డుకు, అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. పేద విద్యార్థుల కోసం స్థాపించిన దేవేంద్ర విద్యాలయ విద్యార్థులు ప్రపంచం గర్వించేస్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ టి.విజయేందర్‌గౌడ్, కరస్పాండెంట్ టి.శ్వేత, వినయేందర్‌గౌడ్, సేక్రెడ్ పాత్స్ ఫౌండర్ ఉష, ప్రిన్సిపాల్ మాధవిశాస్త్రి, వైస్‌ప్రిన్సిపాల్ ఉషారాణి, ఇక్బాల్ అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువు కుంటలకు మరమ్మతులు చేయాలి



చెరువు కట్టను పరిశీలిస్తున్న రాఘవేందర్

కడ్తాల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వర్షాలతో దెబ్బతిన్న చెరువు కుంటలను మరమ్మతు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవలి వర్షాలకు చాలా చెరువు కట్టలు దెబ్బతిని బలహీనం అయ్యాయని తెలిపారు. కడ్తాలలోని దేవర చెరువును గురువారం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కట్ట పర్రెలీడ్చిందని తెలిపారు. కట్టను వెంటనే బలోపేతం చేయకుంటే తెగుతుందన్నారు. రియల్టర్లు తూము మూసేయడంతో నీరు బయటకు వెళ్లక కట్ట తెగే ప్రమాదం ఉందన్నారు. కోతకు గురికాకుండ అధికారులు చర్యలు చేపట్టాలని రాఘవేందర్ కోరారు. ఆయనతో వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవులు, ఇమ్రాన్‌బాబ, కుమార్‌గౌడ్, మహేశ్, రమేశ్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రఘుపాల్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రఘుపాల్, ఉపాధ్యాయులు

కొత్తూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రఘుపాల్ డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చాలని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద ఈనెల 23న నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను పెంజర్ల ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 20నెలలు కావొస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. మహాధర్నాకు ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలని రఘుపాల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సాయన్న, ప్రిన్స్ శ్రీనివాస్, గౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు

- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు
- అమ్మవార్లకు నైవేద్యం సమర్పించిన భక్తులు



ఇబ్రహీంపట్నం : బోనాల ఉత్సవాల్లో విద్యార్థులు, ప్రిన్సిపాల్ డా.రాధిక తదితరులు



కడ్తాల్ : బోనాల ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంపుగూడలో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు వైభవంగా జరుపుకున్నారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాయంత్రం మహిళలు బోనపు కుండలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు, మహిళల పూనకాలు, యువతీ యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, గంప శ్రీను, కృష్ణయ్య యాదవ్, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్, మాజీ రమేశ్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : సంతాపూర్‌లో బోనాల ఊరేగింపు

కేశంపేట : సంతాపూర్‌లో గురువారం పోచమ్మ, మైసమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను తలపై పెట్టుకుని గ్రామ దేవతల ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీయేటా కుల, మతాలకతీతంగా గ్రామంలో వైభవంగా బోనాల వేడుక చేసుకుంటామని బీజేపీ జిల్లా సాంస్కృతిక శాఖ కో-కన్వీనర్ కొరెడ్ల నరేందర్‌రెడ్డి తెలిపారు. మాజీ సర్పంచ్ అంజయ్య, మాజీ ఎంపీటీసీ రాజు, అంజయ్య, సరేందర్‌రెడ్డి, శివకుమార్, రాజు, కృష్ణయ్య తదితరులున్నారు. అదేవిధంగా వేములనర్వలో మైసమ్మ బోనాలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాహిత్య, సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు బోనాలు పేర్చి ఆడిపాడారు. ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక మాట్లాడుతూ పండగలనేవి సామాజిక చైతన్యానికి ప్రతీకలన్నారు. ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక భావనలతో ముందుకు పోవాలనిన్నారు. కార్యక్రమంలో కళాశాల సాహిత్య, సాంస్కృతిక విభాగం కన్వీనర్ డా.చింతల రాకేష్ భవాని తదితరులున్నారు.

యాచారం : నందివనపర్తి, మాల్ గ్రామాల్లో పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఆలయాలను నిర్వాహకులు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వాడవాడలా మామిడి తోరణాలు కట్టారు.

ఆమనగల్లు : చింతలపల్లిలో గ్రామ దేవతల బోనాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ మంజుల యాదయ్య ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఎస్సై వెంకటేశ్, సంఘ సేవకుడు రాము హాజరయ్యారు. మహిళలు ర్యాలీగా వెళ్లి నైవేద్యం సమర్పించారు.



యాచారం : నందివనపర్తిలో బోనాలతో ఆలయానికి తరలిన గ్రామస్తులు

షాద్‌నగర్ అదనపు ఫస్ట్‌క్లాస్ జడ్జిగా మల్యాల సాహితి



షాద్‌నగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ జడ్జితో పాటు అదనపు సివిల్ జడ్జిగా మల్యాల సాహితిని హైకోర్టు నియమించింది. గతంలో ఉన్న జడ్జి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో హైకోర్టు సాహితిని నియమించినట్లు షాద్‌నగర్ బార్ అసోసియేషన్ గురువారం ప్రకటనలో తెలిపింది. హైకోర్టు నుంచి నియామకపు ఉత్తర్వులు రాగానే బాధ్యతలు స్వీకరించనుందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అదనపు జడ్జి నియామకం వల్ల కోర్టులో పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కారమయ్యే అవకాశముందని అభిప్రాయపడ్డారు.

ఎడ్యుకేషనల్ సొసైటీ అభ్యున్నతికి పాటుపడాలి



సబితారెడ్డితో శంకర్‌రెడ్డి

శంషాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజాబహద్దూర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అభ్యున్నతికి తోడ్పాటునందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఈమేరకు సొసైటీ బోర్డు సభ్యుడిగా నియమితులైన శంషాబాద్ వాసి శంకర్‌రెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. నగరంలోని అబిడ్స్‌లో గల రాజాబహద్దూర్ వెంకట్‌రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్‌గా శంకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు గురువారం సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సబితారెడ్డి మాట్లాడుతూ ఎడ్యుకేషనల్ సొసైటీ అనేది ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిందన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఉత్తమ సేవలందిస్తున్న సొసైటీకి డైరెక్టర్‌గా నియమితుకావడం హర్షనీయమన్నారు. మరిన్ని సేవలందించి సొసైటీ అభ్యున్నతికి మరింత తోడ్పాటునందించాలని సూచించినట్లు శంకర్‌రెడ్డి తెలిపారు.

హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలి



రైతులతో కలిసి ఆచారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడ్తాల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న పంట పొలాల మీదుగా వెళతున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కడ్తాల గ్రామ రైతులు ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిని కోరారు. గురువారం కడ్తాలకు వచ్చిన ఆచారికి రైతులు, పలువురు స్థానిక నాయకులు వినతిపత్రం అందజేశారు. బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ఆధ్వర్యంలో బల్లారి నుంచి మీర్కాన్‌పేట వరకు చేపడుతున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు వల్ల సాగు భూములు కోల్పోయి తాము రోడ్డున పడుతామని రైతులు ఆచారితో వాపోయారు. రైతుల ఆమోదం, పంచాయతీ తీర్మానం లేకుండా, ఇష్టానుసారంగా అలైన్‌మెంట్ చేయడం సరికాదని స్థానిక నాయకులు తెలిపారు. కొందరు పారిశ్రామిక వేత్తల ఒత్తిడితో ఇతర ప్రాంతాల మీదుగా ఉన్న విద్యుత్‌లైన్ ఏర్పాటును కడ్తాల మీదుగా తీసుకుపోతున్నారని ఆచారితో రైతులు తెలిపారు. చావనైనా చస్తాము కానీ.. తమ పొలాల మీదుగా విద్యుత్ లైన్ ఏర్పాటును అడ్డుకుంటామని స్పష్టం చేశారు. స్పందించిన ఆచారి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి సమస్యను వివరిద్దామని తెలిపారు. రైతులకు అన్యాయం జరుగకుండ చూస్తానని హామీ ఇచ్చారు. కడారి రామకృష్ణ, రాఘవేందర్, జహంగీర్ అలీ, బొప్పిడి గోపాల్, పెంటారెడ్డి, పిప్పళ్ల వెంకటేశ్, సత్యనారాయణ, పర్వత్‌కుమార్ యాదవ్, రాజు, రాములు, బాధిత రైతులు ఉన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్స్ నిషేధంపై హర్షం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్స్‌ను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేయడంపట్ల బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ యువత అత్యాశలకుపోయి ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమైందనేది గుర్తెరగాలన్నారు. యువత నైపుణ్యాన్ని పెంచుకుని ఏదైనా ఉద్యోగంలో స్థిరపడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అన్నివర్గాల ప్రజలు హర్షిస్తున్నారన్నారు. డ్రగ్స్, గంజాయిలాంటి వాటిపట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలన్నారు. వివిధ సంఘాల నాయకులు, యువత పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామ్‌రెడ్డి తదితరులు

క్రైం కార్నర్

గంజాయి పట్టివేత.. నిందితుడి రిమాండ్

కేశంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగెం గ్రామ శివారులో కేశంపేట పోలీసులు గంజాయి పట్టుకున్నారు. గురువారం గ్రామ శివారులో ఓ వ్యక్తి గంజాయి కలిగి ఉన్నాడన్న విశ్వసనీయ సమాచారం కేశంపేట సీఐ నరహరికి అందింది. వెంటనే ఎస్సై రాజ్‌కుమార్‌తో పాటు సిబ్బందిని అక్కడికి పంపించారు. ఒడిషాకు చెందిన బిస్వంత్ మెహర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. అతడి నుంచి 46 గ్రాముల నిషేధిత మత్తు పదార్థం(గంజాయి) స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు. మత్తు పదార్థాలు వాడడం, నిల్వ చేయడం, అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయిని సీఐ హెచ్చరించారు.

రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు

చేవెళ్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వడం జరుగుతుందని చేవెళ్ల మండల వ్యవసాయాధికారి శంకర్ లాల్ తెలిపారు. గురువారం చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు రాయితీపై యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్సీ ఎస్టీ మహిళా రైతులకు 50 శాతం, మిగతా రైతులకు 40శాతం సబ్సిడీపై బ్యాటరీ స్ప్రేయర్స్ 175, పవర్ స్ప్రేయర్ 24, రోటవేటర్లు 9, కల్టివేటర్లు, కేజీ వీల్స్, ఎంబీప్లౌ, డిస్క్ హారో, రోటోపడ్లర్ 11 ఉన్నాయన్నారు. ట్రాక్టర్‌తో ఎరువులు విత్తనాలు వేసే యంత్ర పనిముట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, జిరాక్స్ పత్రాలను జత చేసి వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రామ పంచాయతీకి వైకుంఠ రథం అందజేత



ముడిమ్యాల్ గ్రామంలో వైకుంఠ రథం ప్రారంభిస్తున్న నాయకులు

చేవెళ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోనె కరుణాకర్‌రెడ్డి తన తల్లి వినోద జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీకి సొంత డబ్బుతో వైకుంఠ రథంను సమకూర్చి అధికారులకు గురువారం అందజేశారు. మాజీ సర్పంచ్ స్వర్ణలత దర్శన్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సుజాత, శ్రీనివాస్, రాములు, రాఘవేందర్, నరేందర్, గోనె సాయి కిరణ్‌రెడ్డి, రవి, శివకుమార్, వెంకటేశ్, గ్రామస్తులున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

కడ్తాల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించి మెరుగైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ నరేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు తెలిపారు. కడ్తాల మండలం సాలార్‌పూర్‌లో గురువారం వారు పర్యటించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలతో రైతులు, ప్రజలు కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. దాంతో ఏఈ, నర్సింహులు సాలార్‌పూర్‌లోని అన్ని కాలనీలలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. 25 కేవీ అదనపు ట్రాన్స్‌ఫార్మర్, 12 విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైరు అవసరమని గుర్తించారు. వాటిని వారం రోజుల్లో ఏర్పాటు చేసి విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేస్తామని ఏఈ నరేందర్ తెలిపారు. లైన్‌మెన్ నరేశ్, స్థానిక నాయకులు ఉన్నారు.

మీడియా విలువలను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న ఎండీ సలీం

షాద్‌నగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నానాటికీ దిగజారుతున్న మీడియా విలువలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షులు ఎండీ సలీం అన్నారు. గురువారం షాద్‌నగర్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) షాద్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మీడియా ప్రాధాన్యత సంతరించుకుంటుందని, ఈక్రమంలో జర్నలిస్టులు జర్నలిజంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, మీడియా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వృత్తిలో ఉన్న ప్రతీ జర్నలిస్టు కూడా ప్రజా సమస్యలను గుర్తించి, వాస్తవాలను ప్రతిబింబించే విధంగా కథనాలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మఫిషియల్ కమిటీ చైర్మన్ గుడుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతో అవసరం



ఉచిత కరాటే శిక్షణలో విద్యార్థులు

కొందుర్గు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతో అవసరం అని మాస్టర్ రమేష్ అన్నారు. గురువారం కొందుర్గు మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఉచిత కరాటే తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు కరాటే నేర్చుకుంటే భవిష్యత్తులో తమను తాము రక్షించుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో ప్రీప్రైమరీ పాఠశాలలు ప్రారంభం

శంకర్‌పల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పాఠశాలల్లో ప్రీప్రైమరీ పాఠశాలలు ప్రారంభం కానున్నాయని ఎంఈవో అక్బర్ తెలిపారు. శంకర్‌పల్లిలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ మాసానిగూడ, మహాలింగపురం, గాజులగూడ, జన్వాడ, అంతప్పగూడ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు త్వరలో ప్రారంభం కానున్నాయని వివరించారు. ఇప్పటికే ఆయా పాఠశాలలను సందర్శించడం జరిగిందని, మౌలికవసతులపై ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు అన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, పేదలందరికీ విద్య అందలానే ఉద్దేశంతోనే ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నదని అన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చేవెళ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేవెళ్ల మండలంలోని ఆలూర్ గ్రామానికి చెందిన షాబాద్ పెంటయ్య ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి గురువారం పెంటయ్యకు రూ.50 వేల నగదును అందించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇల్లు ఇప్పిస్తామని బాధితుడికి ప్రతాప్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మాజీ సర్పంచ్‌లు అనంతరాములుగౌడ్, విజయలక్ష్మీ, ఏఎంసీ డైరెక్టర్ యాదిరెడ్డి, నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

కడ్తాల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఎల్‌బీనగర్ కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ శంకర్ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు ఆదిత్య, రమ్య, శైలజ, కవిత, వైద్యసిబ్బంది దేవేందర్, హర్షలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజుగౌడ్, జగన్ గౌడ్, దేవులా నాయక్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'పనుల జాతర'ను విజయవంతం చేయాలి



మహేశ్వరం : మాట్లాడుతున్న ఎంపీడీవో శైలజ

మహేశ్వరం/కడ్తాల్/మాడ్గుల/కందుకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నేటి(శుక్రవారం) నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్న పనుల జాతర కార్యక్రమంలో అధికారులందరూ తప్పక పాల్గొని విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి శైలజ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో పాటు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మొత్తం 56 రకాల పనులు చేసుకునేలా వీలుంటుందని, ప్రజలకు అత్యవసరమైన పనులు ఏమైనా ఉంటే సంబంధిత పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో రవీందర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు పనుల జాతర

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం కడ్తాల మండలంలో శుక్రవారం పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ప్రకటన విడుదల చేశారు. గ్రామసభలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా పనుల జాతర కార్యక్రమం మాడ్గుల మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో నేడు(శుక్రవారం) నిర్వహించనున్నట్లు ఏపీవో నర్సింగ్ తెలిపారు. ప్రతీ గ్రామ పంచాయతీల్లో పనుల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కందుకూరు ఎంపీడీవో సరిత కోరారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పనుల్లో ఎక్కువ రోజులు పనిచేసిన వారి కుటుంబాల(దివ్యాంగుల)ను గుర్తించి సన్మానించాలని అన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మొక్కలు నాటుతున్న గణేష్, దేవేందర్‌యాదవ్

కొత్తూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతీ ఒక్కరు నడుం బిగించాల్సిన అవసరం ఉందని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో మేరా యువభారత్ నాయకుడు దాసరి శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏక్ పేడ్ మాకే నామ్ అనే నినాదంతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఈట గణేష్, దేవేందర్‌యాదవ్‌లు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దాసరి శ్రీశైలం పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించి, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి : సీఐ



సీఐకి నగదు అందిస్తున్న నిరంజన్ పాఠక్

కడ్తాల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కడ్తాల్ సీఐ గంగాధర్ కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో చాలా వరకు నేరాలను నియంత్రించుకోవచ్చునన్నారు. కర్కల్ పహాడ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎన్‌హెచ్ఏఐ 765 ప్రాజెక్టు మేనేజర్ నిరంజన్ పాఠక్ తోడ్పాటునందించారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ గంగాధర్‌కు రూ.20వేలు సీసీ కెమెరాలకు అందించారు. ఆయన్ను సీఐ అభినందించి సత్కరించారు. ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, ప్రాజెక్టు మేనేజర్ రవీందర్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కేశంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ పథకం తీసుకొచ్చిందని కేశంపేట ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో గురువారం ఉపాధ్యాయులు, గ్రామ రిసోర్స్‌పర్సన్‌లకు ఉల్లాస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి వారికి అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. అవగాహనతో చదవడం, రాయడం, అంకెలను గుర్తించడం, కనీస సామర్థ్యాలతో లెక్కలు చేయడం ఉల్లాస్ లక్ష్యమని తెలిపారు. ప్రాథమిక అక్షరాస్యతలో భాగంగా జీవన నైపుణ్యాలు నేర్పించడం జరుగుతుందని వివరించారు. ప్రతి గ్రామంలో సామాజిక చైతన్య కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాలు, ఉన్నత విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సాంస్కృతిక కేంద్రాలు, గ్రంథాలయాలలో వాలంటీర్లు వయోజనులకు స్వచ్ఛందంగా విద్యను బోధిస్తారని తెలిపారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని ఆయన వివరించారు.

ఈఎస్ఐ ధీమా ఏదీ?

(ఐదో పేజీ తరువాయి)

కొత్త పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. కొత్తూరులో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ సెంటర్ కార్మికులకు ఎంత మాత్రం ప్రయోజనకరంగా లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కార్మికులు ఉదయం ఎనిమిది గంటలకు విధులకు వెళ్తారు. అదే సమయంలో డిస్పెన్సరీ సెంటర్‌లో పనిచేసే డాక్టర్లు, సిబ్బంది వస్తారు. సాయంత్రం కార్మికులు పరిశ్రమల నుంచి బయటికి వచ్చే సమయంలో డిస్పెన్సరీ సెంటర్ సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోతారు. దాంతో సకాలంలో వైద్యం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అత్యవసర చికిత్స కోసం సనత్‌నగర్ ఈఎస్ఐకి వెళ్లాల్సి వస్తుందని కార్మికులు దిగులు చెందుతున్నారు. చెకప్, పరీక్షలంటూ రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. అంతేగాకుండా కొత్తూరు డిస్పెన్సరీ సెంటర్‌లో అవసరమైన మందులు కొన్నిసార్లు అందుబాటులో ఉండవని కార్మికులు వాపోతున్నారు. హైదరాబాద్‌కు వెళ్లాలంటే దూర భారమవుతుందని అంటున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమలతో పాటు షాద్‌నగర్ పక్కన ఉన్న బాలానగర్, జడ్చర్ల పరిధిలోని పోలేపల్లి సెజ్ పారిశ్రామిక వాడలో పని చేసే కార్మికులు కూడా కుటుంబాలకు సౌకర్యవంతంగా ఉంటుందని షాద్‌నగర్‌లో నివాసముంటున్నారు. ప్రతీరోజు బస్సుల్లో వచ్చి పోతుంటారు. వారికి కూడా ఈఎస్ఐ వైద్యం అందుబాటులో ఉండటం లేదని అంటున్నారు.

సనత్‌నగర్ వెళ్లాలంటే ఇబ్బంది



నాకు బ్రెయిన్‌కు సంబంధించిన సమస్య ఉంది. ప్రతీనెల చెక్ చేయించుకోవాలి. ఈఎస్ఐలో ఒకరోజు పరీక్ష చేయించుకుని రిపోర్టుకు మరుసటిరోజు వెళ్లాల్సివస్తుంది. ప్రతీసారి హైదరాబాద్ ఈఎస్ఐకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. అక్కడికి వెళ్లలేక ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్ష చేయించుకుంటే పైసలు ఎక్కువ అవుతున్నాయి.

- వెంకటేశ్, కార్మికుడు, షాద్‌నగర్

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి

(ఐదో పేజీ తరువాయి)

ఆవిష్కరించారు. చన్వెల్లి గ్రామంలో రైతులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖానాపూర్ గేట్ వద్ద శ్రీనివాస కల్యాణ మండపంలో యువ సమ్మేళన కార్యక్రమంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రతీ ఏడాది క్రమం తప్పకుండా మూడు దశల్లో రూ.6వేల చొప్పున చిన్నకారు రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. పేదల కోసం ఉచిత బియ్యం, ఇళ్లు, మరుగు దొడ్లు, గ్యాస్ కనెక్షన్‌లు, పొదుపు సంఘాల మహిళలకు బ్యాంక్ రుణాలు, యువతకు స్వయం ఉపాధి వంటి రుణాలు తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. గ్రామాల్లో రోడ్లు, మరుగుదొడ్లను వీధి దీపాలు, శ్మశాన వాటికలు, రైతు వేదికలు, హరితహారం కింద మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను కేంద్రం సహకారంతోనే అమలవుతున్నాయని పేర్కొన్నారు. చన్‌వల్లి గ్రామానికి ఆర్టీసీ బస్ రావడం లేదని రైతులు, మహిళలు విన్నవించడంతో.. రాంచందర్‌రావు స్పందించి బస్సు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు గాను పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అంతకు ముందు పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేవెళ్ల సెంటిమెంట్‌ను వాడుకుని అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్‌గుప్త, వెంకట్‌రెడ్డి, డాక్టర్ మల్లారి వైభవ్ రెడ్డి, దేవుని శర్వలింగం, శ్రీకాంత్, అనంతరెడ్డి, విజయలక్ష్మీ, జంగం శివానందం, శంకర్‌గౌడ్, ఇంద్రసేనారెడ్డి, కృష్ణమోహన్, కృష్ణగౌడ్, రవీందర్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్, వాసుదేవ్ ఖన్నా, రాములు, నర్సింలు, శ్రీనివాస్‌చారి, దమోదర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, మధుకర్‌రెడ్డి, జయసింహరెడ్డి, పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

యూరియా కొరత లేదు..

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడినంత యూరియాను అందజేసిందని రాంచందర్‌రావు తెలిపారు. చేవెళ్లలోని రైతు ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలించారు. యూరియా కొరత, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రానికి 20 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని కోరగా, కేంద్ర ప్రభుత్వం అంతే మొత్తంలో ఇప్పటికే పంపించిందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మరో 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి పంపనున్నదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలనే రైతులను భయభ్రాంతులకు గురిచేసే ప్రకటనలు మానుకోవాలని హితవుపలికారు.

దోమల నివారణ చర్యలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

మహేశ్వరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దోమలే కదా అని నిర్లక్ష్యం చేయకుండా.. నివారణ చర్యలు తీసుకునేలా ప్రతీ విద్యార్థి ప్రజలను చైతన్య పర్చాలని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. గురువారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమలు అత్యంత ప్రమాదకరమని దోమలు కుట్టకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శ్రీదేవి, ఇంతియాసుద్దీన్, జాహేదా, ఉపేంద్ర, నరేందర్‌రెడ్డి, శ్రీహరి రెడ్డి, గోపాల్, పర్వత్, తదితరులు పాల్గొన్నారు.

'కోట మైసమ్మ'కు కిరీటం, వడ్డాణం బహూకరణ

కేశంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలోని కోట మైసమ్మ గ్రామ దేవతకు కిరీటం, వడ్డాణం బహూకరించారు. గ్రామానికి చెందిన వన్నవాడ అర్చన, రమేష్ గౌడ్, వరలక్ష్మి, మనోహర్‌గౌడ్, రాజేశ్వరిలు గురువారం అమ్మవారికి కిరీటం, వడ్డాణం బహూకరించారు. పూజారి వేణుగోపాల శర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి వాటిని అలంకిరంచారు. దాదాపు రూ. 40వేలు ఖర్చుచేసి వెండి కిరీటం, వడ్డాణం చేయించినట్లు దాతలు తెలిపారు.



వడ్డాణం, కిరీటాన్ని అలంకరించి పూజలు చేస్తున్న దాతలు